

కరువుపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ
- దేవనకొండ టర్నింగ్‌లో రోడ్డు దిగ్బంధనం
- అధికారుల హామీతో విరమణ

ప్రజాశక్తి - దేవనకొండ

కరువుపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో దేవనకొండ టర్నింగ్ కర్నూలు, బళ్లారి రోడ్డును దిగ్బంధించారు. భారీగా వచ్చిన రైతుసంఘం, వ్యకాస నాయకులు, కార్యకర్తలు, రైతులు నినాదాలతో రోడ్డు మార్మోగింది. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, రైతుల బ్యాంకు, అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని, వాతావరణ బీమా పరిహారం ఇవ్వాలని, బోరు, బావుల కింద వేసిన పంటలకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించి వలసలు ఆపాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దాదాపు గంటకు పైగా రోడ్డు దిగ్బంధనం చేపట్టారు. గంటసేపు రోడ్డు దిగ్బంధనం చేపట్టినా ప్రయాణికుల నుంచి వ్యతిరేకత రాకపోగా బస్సుల్లో నుంచి దిగివచ్చి ఆందోళన చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలిపారు. 'ఆర్‌డిఒ వచ్చి హామీ ఇవ్వాలని' అన్నప్పుడు ప్రయాణికులు కూడా స్వరం కలిపారు. వాహనాల రాకపోకలు ఆగిపోవడంతో దేవనకొండ తహశీల్దార్ వెంకటేష్ నాయక్ వాహనం కూడా ఆగడంతో అక్కడే ఆగిపోయారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు, వ్యకాస నాయకులు రామకృష్ణ, వీరశేఖర్, రంగారెడ్డి, పి.హనుమంతు, బాలకృష్ణ మాట్లాడారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు తీవ్రంగా ఉందని, ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో పట్టుమని పది రోజులు కూడా వర్షం వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. పత్తి, ఉల్లి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జలు, మిరప, టమోటా వంటి పంటలకు రూ.వేలకు వేల పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది, ఈఏడాది కరువు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం రైతులను ఆదుకునే నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రోడ్డు దిగ్బంధనంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ముఖ్యమంత్రి గత రెండు నెలల్లో ఉమ్మడి జిల్లాలో రెండు సార్లు పర్యటించారని, కరువుపై మాట్లాడకపోవడం దారుణమని విమర్శించారు. ముఖ్యమంత్రి వచ్చినప్పుడు వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం తప్ప సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యం జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి వందలాదిమంది పొట్ట చేత్తో పట్టుకుని వలస వెళ్తున్నారని తెలిపారు. వలసలు అరికట్టే చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. కరువుపై వెంటనే ప్రభుత్వం ప్రకటన చేయాలని, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్ణయించి కరువుపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కరువు, అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో టమోటా, ఇతర వాణిజ్య పంటలు వేసుకున్న రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు 9 గంటలు విద్యుత్ ఇస్తున్నామన్న ప్రభుత్వం కేవలం 5 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తోందని, పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టం జరుగుతోందని తెలిపారు. కరువు నేపథ్యంలో పశువులకు గ్రాసం ఉచితంగా సరఫరా చేయాలని, వలసల నివారణకు అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాను కరువుగా ప్రకటించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఆర్‌డిఒ హామీ ఇవ్వాలని నాయకుల పట్టు

రోడ్డు దిగ్బంధనం నేపథ్యంలో పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి వచ్చి కరువుపై స్పష్టమైన ప్రకటన చేసి హామీ ఇచ్చిన తర్వాతనే దిగ్బంధనాన్ని విరమిస్తామని రైతు, వ్యకాస నాయకులు స్పష్టం చేసిన నేపథ్యంలో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడే ఉన్న తహశీల్దార్ వెంకటేష్ నాయక్ వచ్చి ఫోన్‌లో ఆర్‌డిఒతో, నాయకులతో మాట్లాడించారు. ఆర్‌డిఒ హామీ మేరకు, వ్యవసాయ అధికారి, విద్యుత్ ఎఇ, దేవనకొండ ఎస్ఐ భూపాలుడు హామీతో దిగ్బంధనాన్ని విరమించారు. రైతు, వ్యకాస నాయకులు తుగ్గలి శ్రీరాములు, రంగస్వామి, ఆస్పరి రంగస్వామి, రామాంజనేయులు, దేవనకొండ మండల నాయకులు నాగేష్, మహబూబ్ బాష, బజారి, తెర్నేకల్లు శ్రీరాములు, బడేసాబ్, లింగన్న, సుధాకర్, సుంకన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, వీరేంద్ర, రసూల్, పల్లెదొడ్డి నాగేష్, రమేష్, రాయుడు, మహేంద్ర, బలరాముడు, బండ్లయ్య, వందలాదిమంది రైతులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీలను నాణ్యతతో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమ నిర్వహణలో భాగంగా శుక్రవారం కల్లూరు ఎంపిడిఒ కార్యాలయంలో స్పందనను నిర్వహించారు. కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే జిల్లా వరకు రావాల్సిన అవసరం ఉండదని తెలిపారు. అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంటును కార్యాలయాల వద్దకు పిలిపించి అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిపి బి.శారద పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించి జీరో పురోగతి నమోదు చేయకూడదని చెప్పినప్పటికీ బిలో బేస్‌మెంట్ లెవెల్ స్టేజి నుంచి బేస్మెంట్ లెవెల్ స్థాయిలో కొన్ని మండలాలు జీరో పురోగతి నమోదు చేస్తున్నాయన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు ఎక్కువ ఉన్నప్పటికీ కోసిగి, కౌతాళం, ఎమ్మిగనూరు మండలాలు జీరో పురోగతి చేస్తున్నారని ఎంపిడిఒలను ప్రశ్నించారు. నందవరం, ఆస్పరి, కోడుమూరు, గూడూరు అర్బన్, పెద్దకడబూరు నిర్దేశించిన లక్ష్యాలు తక్కువ ఉన్నాయన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి చిప్పగిరి మండలంలోని డేగలహాళ్, నానుచర్ల గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ శనివారం లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌కు సంబంధించి గూడూరు, ఎమ్మిగనూరు, నందవరం, కోడుమూరు మండలాలలో పురోగతి తక్కువగా ఉందని, పురోగతి సాధించే విధంగా కలెక్టర్ ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ఐఆర్ఏడి పంపించిన రోడ్డు నిర్మాణ పనులు మరమ్మతులకు కొన్నింటిని తిరస్కరించిన రవాణా శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఆర్‌టిఒ రమేష్, ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం, ఆర్‌టిసి అధికారులు, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై చర్యలు

జిల్లాలో మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని పాఠశాలల్లో, కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ... ఇప్పటివరకు 13 కేసులు నమోదు చేశామన్నారు. 54 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత నిర్వీర్యం చేస్తామని తెలియజేశారు. జిల్లాలో ఎక్కడా మత్తు పదార్థాలు లభించకుండా, సేవించకుండా ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని గద్దె దించాలి

- బిజెపికి కొమ్ముకాస్తున్న పార్టీలను ఓడించాలి
- సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని గద్దె దించాలని సిపిఎం కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు కోరారు. ఈనెల 30న కర్నూలు పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు జరిగే 'ప్రజారక్షణ భేరి' బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.మహ్మద్ రఫీ అధ్యక్షతన 45, 46వ వార్డుల్లోని నరసింహారెడ్డి నగర్, అశోక్ నగర్, శ్రీనగర్ కాలనీ, లేబర్ కాలనీ, టీచర్స్ కాలనీ, అజీముద్దీన్ నగర్, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. రాముడు, సిపిఎం నగర కమిటీ సభ్యులు జెఎమ్‌డి.ఉస్మాన్ బాష, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎమ్.భాస్కర్ మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి వ్యక్తిగత ప్రయోజనాల కోసం బిజెపికి కొమ్ము కాస్తున్న పార్టీలను ఓడించాలని కోరారు. 'ఒక్క ఛాన్స్' అని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం బిజెపి చేసే చట్టాలకు మద్దతిస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజల మధ్య చిచ్చుపెట్టి ప్రజల సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ పథకాల పేరు చెప్పి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా, అభివృద్ధి గురించి మాట్లాడితే పోలీసుల ద్వారా నిర్బంధాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈనెల 30న సాయంత్రం 6 గంటలకు కర్నూలు పాతబస్టాండ్‌లో జరిగే బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ హాజరవుతారని తెలిపారు. సిపిఎం సభ్యులు బి.గోపాల్, ప్రసాద్, మల్లి, శ్రీను, గోపాల్, హుస్సేన్ బాష, చాంద్, నగేష్, బీరప్ప, గోవిందు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. సిపిఎం వార్డు నాయకులు ఎస్.అజ్మత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని సిపిఎం ప్రత్యామ్నాయ ప్రణాళికను విడుదల చేసిందని తెలిపారు. ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ముగింపుగా నవంబరు 15న విజయవాడలో జరిగే మహా ధర్నాకు ప్రజలు కదిలి రావాలని కోరారు. సిపిఎం నగర నాయకులు సి.శేషాద్రి, వార్డు నాయకులు ఆర్.శేషం రాజు, ఆర్.రాజు, వై.శంకర్, జయన్న, వై.సత్యాలు, కె.ప్రకాష్, బి.సంజన్న, రత్నం, బిర్లాగడ్డ హమాలీ యూనియన్ నాయకులు సురేష్, సూర్య రాజు, మహబూబ్ బాష, మధు, చిన్న మౌలాలి పాల్గొన్నారు. అలాగే నగరంలోని బుధవార పేట 15వ వార్డులో ప్రచార యాత్ర సాగింది. సిపిఎం వార్డు నాయకులు ఆర్.చంద్ర అధ్యక్షత వహించారు. అతిథులుగా సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ, కె.రాముడు హాజరై మాట్లాడారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.రామకృష్ణ, సిపిఎం నాయకులు బి.లక్ష్మన్న, ఎం.రాజు, ఎన్.రాజు, శరత్, బి.వినయ్, తిక్కన్న, బి.మద్దిలేటి, అశోక్, నాగరాజు, చంద్ర, వెంకటేష్, అంజి, పౌల్ రాజ్ పాల్గొన్నారు. **కర్నూలు (క్రైమ్)** మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ యాత్రను సిపిఎం సీనియర్ నాయకులు ఆంజనేయులు, బి.వెంకటేశ్వర్లు, పంచలింగాల మాజీ సర్పంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర మాట్లాడారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జరిగే బస్సు యాత్రను, బహిరంగ సభను ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు శ్రీరాములు, నాయకులు మస్తాన్, ప్రకాష్, అబ్దుల్లా, గోపాల్, అంజి, సురేష్, హరి, చాంద్ బాష పాల్గొన్నారు. **వెల్దుర్తి** మండల శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. సిపిఎం జిల్లా నాయకులు నగేష్ మాట్లాడారు. సిపిఎం నాయకులు మల్లి, బద్రి, నాగన్న, పెద్దన్న, సిఐటియు నాయకులు పెద్ద ఏసు, గిడ్డయ్య, మధు, లచ్చి, మద్దయ్య పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)**నగరంలోని 32, 33వ వార్డుల్లో ప్రచార యాత్ర నిర్వహించారు. 32వ వార్డు వెంకటా చలపతి నగర్, పోలీస్ కాలనీ, శర్మ కాలనీల్లో, 33వ వార్డు కల్లూరు చెంచు నగర్, పంచాయత్ ఆఫీస్, ఊరవాకిలి, రామిరెడ్డి తాత గుడి, కురువ గేరి ప్రాంతాల్లో ప్రచారం సాగింది. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప, ఎంసి.ఆనంద్, జె.శ్రీనివాసులు, ఎం.దావీదు, ఎం.తిమ్మప్ప, 32వ వార్డులో సురేష్, మనోహర్, రమణమ్మ, ముజఫర్ నగర్ హమాలీ కార్మికులు, 33వ వార్డులో సుంకన్న, మధు, కల్లూరు సెంటర్ హమాలీలు పాల్గొన్నారు.

పత్తికొండలో సిపిఎం ప్రజా రక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి ప్రజలను కోరారు. ఈశ్వర్ రెడ్డి భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని , నిత్యవసర సరుకులు, గ్యాస్ డీజిల్ ,పెట్రోల్ ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా కారు చౌకగా అమ్ముతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తానని , వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొస్తానని ప్రజలను మోసం చేస్తూరన్నారు. బస్సు యాత్రలో కార్మికులు, కర్షకులు, రైతులు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



45, 46వ వార్డుల్లో ప్రచారం చేస్తున్న రాముడు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలకం

- టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జీ టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సమాజంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని బుధవారపేటలో మాజీ కార్పొరేటర్ పామన్న పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా టిజి భరత్ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల కోసం పనిచేసే విభాగాల్లో అతి కష్టమైనది శానిటేషన్ విభాగమన్నారు. పారిశుధ్య కార్మికులు వాడవాడనూ శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలు కాపాడేందుకు కష్టపడతారన్నారు. తమ ప్రభుత్వం వస్తే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాలు కాపాడేందుకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన కిట్లను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు టిజివి కుటుంబం స్థానికంగా ఉన్న ఆలయానికి విరాళమిచ్చిన విషయాన్ని టిజి.భరత్ గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా తాము 40 ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్నట్లు భరత్ తెలిపారు. అధికారంలో ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. స్థానికంగా మరుగుదొడ్ల సమస్య ఉందని ప్రజలు టిజి భరత్ కు తెలిపారు. తాను గెలిచిన వెంటనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు అక్కడున్న సుంకులా పరమేశ్వరీ ఆలయంలో టిజి భరత్ పూజలు చేశారు. నేతలు జేమ్స్, రామయ్య, రామ క్రిష్ణబాబు, వినయ్, చంద్రశేఖర్, బార్గవ, సత్యనారాయణ, హరిబాబు, గిరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తుగ్గలి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. శుక్రవారం తుగ్గలిలో జగనన్నను మరోసారి ఎందుకు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని విషయాలపై గృహ సారథులకు, సచివాలయం కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తల కు పార్టీ మండల కన్వీనర్ జిట్ట నగేష్ యాదవ్, సచివాలయం మండల కన్వీనర్ హనుమంతుల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎమ్మెల్యే శ్రీదేవికి స్థానిక వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి లు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ కు జగనన్న ప్రభుత్వంలో సచివాలయ వాలంటీర్లు, ఉద్యోగులకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలని ఆమె తెలిపారు. వక్ఫ్ బోర్డ్ బోర్డ్ మైనార్టీ డైరెక్టర్ టిఎండి.హుసేని, సహకార సంఘం అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, ఎర్ర నాగప్ప ,కో ఆప్షన్ సభ్యులు చాంద్ బాషా, సర్పంచులు షేక్ లడ్డు కమల్‌బాష, ఎంపిటిసిలు, జల్లా సుంకన్న, రాజు పాల్గొన్నారు.

ఆర్‌డిఒను కలిసిన రామ్మోహన్

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ రెవెన్యూ డివిజన్ అధికారిని ఎస్.రామలక్ష్మిని కెపిఆర్ మైత్రి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామ్మోహన్ శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మెమోంటో అందజేశారు. ఈయన వెంట మైత్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

గుక్కెడు తాగునీరు కరువు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ
- ట్యాంకుల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు

పట్టణ ప్రజలకు గుక్కెడు తాగునీరు అందించలేకపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గూడూరులో రూ.54 కోట్లతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.మోహన్ మాట్లాడారు. పట్టణాన్ని నగర పంచాయతీగా చేసి 12 ఏళ్లవుతున్నా ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించడం లేదని తెలిపారు. నగర పంచాయతీ చేసి ప్రజలపై పన్నులు భారాలు వేశారే తప్ప అభివృద్ధి చేయడంలో, ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. గూడూరులో తాగునీటి సమస్యతో పాటు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.54 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తామని అధికార పార్టీ నాయకులు ప్రగల్బాలు పలికారని చెప్పారు. నాలుగున్నర ఏళ్లు కావస్తున్నా ట్యాంకుల నిర్మాణం పూర్తి కాలేదని తెలిపారు. ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారని చెప్పారు. తుంగభద్ర, హంద్రీ నదిలో ఇసుక ఉంటే భూగర్భ జలాలకు పుష్కలంగా ఉంటాయని, ఇసుకను దోచుకు తింటున్నారని తెలిపారు. పనులు చేయకుండా వెళ్లిన కాంట్రాక్టర్లను తీసుకొచ్చి పనులను మొదలు పెట్టాలని ఎమ్మెల్యే సుధాకర్‌ను, కౌన్సిలర్ సభ్యులను కోరారు. లేకపోతే ప్రజలను, కలిసి వచ్చి పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని దీక్షలు, ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు దానమన్న, మున్నప్ప పాల్గొన్నారు.




ట్యాంకు పనులను పరిశీలిస్తున్న నాయకులు

కెపా ఐవిఎం చికిత్సతో ఓ జంటకు గర్భం

- ఒయాసిస్ ఫెర్టిలిటీలో మొదటిసారిగా విజయం
- కన్సల్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలులోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో అధునాతన చికిత్స కెపా ఐవిఎం ద్వారా ఓ జంట గర్భం దాల్చడం ఆనందంగా ఉందని ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ హెడ్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచంలోనే అతి తక్కువ కేంద్రాల్లో ఐవిఎం చికిత్స అందుబాటులో ఉందన్నారు. సాధారణ ఐవిఎఫ్ చికిత్స సమయంలో 10 నుంచి 12 రోజుల వరకు ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గుడ్లు రెండు సెంటీమీటర్ల పరిమాణంలోకి వచ్చిన తర్వాత గుడ్డులోకి స్పెర్మ్‌ను ఇంజెక్ట్ చేస్తామని తెలిపారు. కెపా ఐవిఎంలో రెండు నుంచి మూడు ఇంజెక్షన్లు ఇస్తే సరిపోతుందన్నారు. దీనిని డ్రగ్ ఫ్రీ ఐవిఎఫ్ అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. ఈ కొత్త టెక్నిక్ మాతృత్వాన్ని సాధించడానికి సురక్షితమైందని, తక్కువ ఖర్చుతో కూడుకున్నదని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూసే దంపతులు ఎవరైనా దీనిని యూజ్ చేసుకోవచ్చని చెప్పారు. కెపా ఐవిఎం అనేది పిసిఓఎస్, రెసిస్టెంట్ ఓవరీ సిండ్రోమ్, ఓసైట్ మెచ్యూరేషన్ సమస్యలు, థ్రోంబోఫిలియా, క్యాన్సర్ ఉన్న స్త్రీలతో సహా కొంతమందికి ఇది ఒక ఆశాకిరణమని తెలిపారు. మాతృత్వపు ప్రయాణం అందరికీ ఒకేలా ఉండదన్నారు. కొందరికి కొంచెం కష్టంగా ఉంటుందన్నారు. ఆశ, పట్టుదల, సహనంతో పాటు సరైన సంతానోత్పత్తి కేంద్రం కూడా ఉండాలన్నారు. ఆశలు కోల్పోయి తల్లిదండ్రుల కలను వదులుకునే జంటలు చాలా ఉన్నాయన్నారు. అనేక ఇతర కేంద్రాలకు వెళ్లి ఆశను వదులుకున్న ఒక జంట కర్నూలులోని ఒయాసిస్ ఫెర్టిలిటీకి విచ్చేశారని తెలిపారు. కెపా ఐవిఎం (కెపాసిటేషన్ ఇన్ విట్రో మెచ్యూరేషన్) కారణంగా అధునాతన సంతానోత్పత్తి చికిత్సతో ఈ జంట బిడ్డ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ కో ఫౌండర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జీ రావు, ఒయాసిస్ ఫెర్టిలిటీకి సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య మార్గదర్శకత్వంలో ఇది సాధ్యమైందని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

పేదలకు వరం.. 'ఆరోగ్య సురక్ష' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మద్దికెర

మద్దికెర మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎల్లప్పుడు పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిలుస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా చికిత్స చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాధితులు కూడా జిల్లా రాష్ట్రస్థాయిలో ఆరోగ్య సురక్ష ద్వారా తగిన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వాలంటీర్లు సచివాలయం సిబ్బంది సహకారంతో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను సేకరించి ఆరోగ్య సురక్ష ద్వారా వారికి నాణ్యమైన చికిత్స అందించాలని కోరారు. ఎప్పుడు లేని విధంగా ఆరోగ్య సురక్ష పేదలకు వరంగా మారిందని తెలిపారు. అనంతరం అంగన్వాడి స్టాల్‌ను కస్తూర్బా స్కూల్లో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపిపి అనిత యాదవ్, జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి , సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ సర్పంచ్ శాంతన్న మాజీ ఎంపిపి మల్లికార్జున యాదవ్, ఎంపిటిసి అంజి కృష్ణ, పంచాయతీ సలహా దారుడు బండారు ఆంజనేయులు పాల్గొన్నారు.

వస్తువులు, పార్శిల్స్ సత్వర బట్వాడాకు కేరాఫ్ కార్గో

- ప్రజా రవాణా ప్రాంతీయ అధికారి వెంకట్రామం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో ద్వారా వస్తువులు, పార్శిల్లు సత్వర బట్వాడా చేసి వినియోగదారుల మండలాలను పొంది కేరాఫ్‌గా నిలిచి ఆదాయాన్ని ఆర్జించి పెడుతోందని కర్నూలు ప్రజా రవాణా ప్రాంతీయ అధికారి వెంకట్రామం తెలిపారు. శుక్రవారం కార్గో మాసోత్సవాల సందర్భంగా కర్నూలు కార్గో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టిసికి ప్రయాణికుల ద్వారానే కాకుండా షాపులు, ఖాళీ స్థలాలు, కార్గో ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. 2017 ఆగస్టులో ఎఎన్ఎల్ నుంచి కార్గోగా మారిందని, నాటి నుంచి రూ.17 కోట్ల ఆదాయం ఉన్నది రూ.169 కోట్లకు చేరిందని చెప్పారు. బుకింగ్ బట్వాడాల కోసం ఏజెన్సీలను నియమించి వస్తువుల రవాణాను చేస్తున్నామన్నారు. కొత్త కంటైనర్లను జిల్లాకు రెండు చొప్పున తెప్పించామని తెలిపారు. జిల్లాలో ప్రతినెలా కార్గో ద్వారా రూ.45 లక్షల ఆదాయం వస్తుందన్నారు. కార్గో ఎటిఎం కమర్షియల్ దానమ్మ, వన్ డిపో మేనేజర్ సుధారాణి, టు డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టిడిపి వృద్ధ నాయకులకు కాలం చెల్లింది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సిబెళగల్

నియోజకవర్గంలోని టిడిపి వృద్ధ నాయకులకు రాజకీయంలో కాలం చెల్లిందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. శుక్రవారం బెళగల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాబు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారని విమర్శించారు. ఆయన చేసిన పాపాలే జైలు పాలు చేశాయని తెలిపారు. రాష్ట్రంలో టిడిపికి మనుగడ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పాస్ పుస్తకం ఇస్తారా.. ఆత్మహత్య చేసుకోవాలా..?

- తహశీల్దార్ ఎదుట వృద్ధుని ఆవేదన...

పత్తికొండ : పొలం పాస్ పుస్తకం కోసం కొన్నేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, పాస్ పుస్తకం ఇస్తారా ఆత్మహత్య చేసుకోవాలా అన్న సంఘటన పత్తికొండలో చోటుచేసుకుంది.. రైతు పూజారి బ్రహ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.... పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామంలో సర్వేనెంబర్ 29 సి 3.40 పట్టాదార్ పాస్ పుస్తకం కోసం పత్తికొండ తహశీల్దార్ విష్ణు ప్రసాద్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నా భార్య అనారోగ్యంతో కర్నూలు హాస్పిటల్‌లో చేర్పించాను. మానసికంగా ఇబ్బంది పడుతున్నాను. పట్టాదారు పాస్ పుస్తకం అడిగితే ఏదో ఒక కారణం చెబుతూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. నా దగ్గర మీకు ఇచ్చేంత కాసులు లేవు. కూలి పని చేసుకుంటూ భార్య పిల్లలుతో జీవనం సాగిస్తున్నాను. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

పార్కింగ్ వేలాల్లో రూ.1.20 లక్షల ఆదాయం

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని ఖానా ఖజానా (ఈట్ స్ట్రీట్), గుత్తి రోడ్డు జంక్షన్ వద్ద వెహికల్ పార్కింగ్‌కు నిర్వహించిన వేలాల్లో కర్నూలు నగర పాలక సంస్థకు రూ.1.20 లక్షల ఆదాయం వచ్చినట్లు కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలోని ఓల్డ్ కౌన్సిల్ హాలులో వేలాలు నిర్వహించారు. ఖానా ఖజానా (ఈట్ స్ట్రీట్) వద్ద పార్కింగ్ స్థలాన్ని పి.హరి స్వరూప్ రెడ్డి రూ.50 వేలకు, గుత్తి రోడ్డు జంక్షన్ పార్కింగ్ స్థలాన్ని డి.మహబూబ్ బాష రూ.70 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు.

మిరప పంటను ధ్వంసం చేసిన దుండగులు

ప్రజాశక్తి - కోసిగి


దుండగులు ధ్వంసం చేసిన మిరప పంట

రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన మిరప పంటను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. కోసిగికి చెందిన హరిజన గడ్డ చిన్న ఈరన్న, చాముండేశ్వరి దంపతులు రెండెకరాల మిరప పంట సాగు చేశారు. దాదాపు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టారు. వారంరోజుల్లో మిరపకాయలను తెంపించాలనుకున్నారు. ఈలోపే గుర్తు తెలియని దుండగులు మిరప పంటను కర్రలతో బుడానికి విరిగేలా ధ్వంసం చేసి వెళ్లిపోయారు. రోజూ మాదిరిగానే రైతు హరిజన గడ్డ చిన్న ఈరన్న ఉదయం వెళ్లి పంటను చూడగా మిరప చెట్లు మొత్తం నేలమట్టమై ఉండడాన్ని గుర్తించి కన్నీరు మున్నీరయ్యారు. మిరపకాయలు కోయడానికి సిద్ధమయ్యేలోపు పంటను పూర్తిగా ధ్వంసం చేయడం ఏమిటని బోరున విలపించారు. ఇలాంటి పరిస్థితి వేరే రైతులకు రాకూడదని బాధిత రైతు దంపతులు ఈరన్న, చాముండేశ్వరి వాపోయారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల జీవితాలు మార్చిన 'నవరత్నాలు'

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన నవరత్న పథకాలు ప్రజల జీవితాలను మార్చేశాయని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని ఖాజీపుర, మరాఠీగేరి వీధుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్, అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, చంద్రకాంత్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్లు రేణుక, మంజుల, రామలింగేశ్వర యాదవ్, జైపాల్, వార్డు కౌన్సిలర్ పద్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, సురేష్ గౌడ్, తాయన్న, శ్రీనివాసరెడ్డి, కృపాకర్, శంకర్, నాగరాజ్, చిన్న ఈరన్న, వీరప్ప, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వికె.వెంకటేష్, వీరభద్రప్ప పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి సాగనంపండి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు


ప్రజలకు వివరిస్తున్న తిక్కారెడ్డి

రాష్ట్రంలో వర్షాల్లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, రైతులకు సాగునీరు, విద్యుత్ అందించలేక నిర్లక్ష్యం చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని బసలదొడ్డి గ్రామంలో 'బాబుతో నేను' నిర్వహించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు, అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మాయమాటలు చెబుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, కురువ మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, గవి గట్టు రాజశేఖర్, నల్లారెడ్డి, కురువ కృష్ణ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహానికి తిక్కారెడ్డి విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీవాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి రూ.51 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం స్థానిక శ్రీవాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులకు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి చేతులమీదుగా సీనియర్ నాయకులు అర్చక వ్యాసరాజస్వామితో కలిసి నగదును ఇచ్చారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందించానని తిక్కారెడ్డి తెలిపారు. ఈ నెల 30న వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణకు వాల్మీకి విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు ఆహ్వానించగా ఆయన అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు వాల్మీకి నాయకులు తెలిపారు. టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం వాల్మీకి అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం వాల్మీకి కృష్ణమోహన్ రెడ్డి, మేకల నరసింహులు, డిసి.తిమ్మప్ప, ఎంపిటిసి వెంకటేష్, దుల్లయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, లక్ష్మారి వీరేష్, కాసీం, వట్టేప్ప గారి నరసింహ పాల్గొన్నారు.

డిసెంబర్ ఆఖరి వరకు

ఎల్‌ఎల్‌సికి సాగునీరివ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువకు డిసెంబర్ ఆఖరి వరకు సాగునీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆటో జాతాను వెంకటేశులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయని తెలిపారు. చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. కనీసం తుంగభద్ర దిగువ కాలువ కింద సాగయిన పంటలకు డిసెంబర్ చివరి వరకు సాగునీరందించి పంటలను కాపాడాలని కోరారు. అధికారులు నవంబర్ 25కే ఎల్‌ఎల్‌సి కాలువకు నీరు బంద్ అవుతాయని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆయకట్టులో సాగయిన వరి, మిరప, పత్తి పంటలు రైతులకు అందాలంటే డిసెంబర్ చివరి వరకు సాగునీరు అవసరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నవంబర్‌లో బంద్ చేయడం వల్ల ఆయకట్టు రైతులు కూడా పూర్తిగా నష్టపోతారని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఎం మండల నాయకులు ఉలిగయ్య, వెంకటేశులు, వీరేష్, సత్యప్ప, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు వీరేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి మారయ్య, తాయప్ప పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ ఆవరణంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, మండల నాయకులు దండు ఖాజా, బి.కరుణాకర్‌లు సిపిఎం ప్రజా రక్షణ భేరి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న పాలకులకు, ప్రతిపక్షాలకు రాష్ట్రాభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు. బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందని, ప్రపంచంలోనే ఆకలి ఎక్కువ ఉన్న దేశాల్లో భారతదేశం చేరిందని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టని కేంద్ర ప్రభుత్వంపై మాట్లాడే దమ్ము వైసిపి, టిడిపి లేదన్నారు. ప్రజల సంక్షేమం పట్టని ఈ పాలక వర్గాల తీరుకు వ్యతిరేకంగా 'ప్రజా రక్షణ భేరి' యాత్రను సిపిఎం చేపట్టిందన్నారు. ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు యాత్ర ఈనెల 30న ఆదోని నుంచి బయల్దేరి ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ మీదుగా కోడుమూరు, కర్నూలు దాకా జిల్లాలో కొనసాగుతుందని తెలిపారు. కోడుమూరులో సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభకు గోనెగండ్ల మండలం నుంచి అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. **నందవరం** మండలంలోని నాగలదిన్నె గ్రామం వివర్స్ కాలనీలో గడిగ లక్ష్మీదేవి ఇంటి ఆవరణలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, మండల నాయకులు ఎల్లేష్, రవి, నగేష్, సంతోష్, నరసింహులు, పెద్దయ్యలు గోడపత్రికను విడుదల చేశారు. **ఆస్పరి** మండలం కైరుప్పల గ్రామంలో ప్రచార జీపు జాతా సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బాలకృష్ణ మాట్లాడారు. ఆస్పరిని కరువు మండలంగా ప్రకటించి, వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి తక్షణమే పనులు చేపట్టాలని కోరారు. సిపిఎం నాయకులు రంగస్వామి, నరసింహులు, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి, నవీన్, డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి శివ, మురళీ, రామాంజనేయులు, వీరభద్రి, వెంకటేష్, కాశన్న, రాము పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని ఆలూరు, హులేబీడు, తుంబలబీడు, పెద్దహోతూరు గ్రామంలో ప్రజా రక్షణ భేరి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కన్వీనర్ షాకీర్ మాట్లాడారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఈనెల 30న ఆదోని నుంచి ప్రారంభమై ఆలూరులో 12 గంటలకు పాత బస్టాండ్‌లో జరిగే సభకు రైతులు, యువత, మహిళలు, వివిధ ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు


గోనెగండ్లలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు


నందవరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న గురుశేఖర్

పంటల నమోదు, ఈకేవేసి పూర్తి

- ఎఒ శివశంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదు సరిచేసుకోవాలని ఎఒ శివశంకర్ తెలిపారు. శుక్రవారం హాలహర్వి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట నమోదు, రైతుల ఈకేవైసి పూర్తయిన వివరాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి 30 వరకు సోషల్ ఆడిట్, పంటల నమోదు చేసిన పేర్లను ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఉంచామని తెలిపారు. రైతులందరూ వారి పంటల నమోదును సరి చేసుకోవాలని కోరారు. ఎవరైనా రైతులు అభ్యంతరాలు తెలిపితే వాటిని నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. విఆర్‌ఒ రామాంజినేయులు, విఎఎ ఇంద్రజ పాల్గొన్నారు.

రైతు భరోసా జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - సిబెళగల్


మండలంలోని కొత్తకోట, ముడుమాల, కొండాపురం గ్రామాల రైతుభరోసా కేంద్రాల్లో ఎఒ మల్లేష్ కుమార్ రైతుభరోసా అర్హుల జాబితాను ప్రదర్శించారు. శుక్రవారం కేంద్రాలను తనిఖీ చేసి స్టాకు వివరాలు, లబ్ధిదారుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పంట నమోదు ప్రక్రియ ముగిసిందని, అందులో రైతులకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని పేర్కొన్నారు.

'లక్ష్య సాధనకు అందరి సహకారం అవసరం'

ఆదోని : రోజువారీ డోర్ డెలివరీ బుకింగ్స్ లక్ష్యం 7 వేలు సాధించేందుకు అందరి సహాయ, సహకారం అవసరమని ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీక్ అహ్మద్ తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆర్‌టిసి కార్గో సర్వీసు నేపథ్యంలో శుక్రవారం ఆదోని ఆర్‌టిసి డిపోలో డోర్ డెలవరీ పార్సిల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాంతీయ, సుదూర ప్రాంతాలకు నమ్మకంగా, నాణ్యతతో తక్కువ సమయం, ధరలపై పార్సిల్ సేవలను ప్రయాణికులు, ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆర్‌టిసి ఉద్యోగిపై ఉందన్నారు. ప్రతి ఉద్యోగి కనీసం నలుగురు బంధువులు, మిత్రులకు పార్సిల్ పంపించి సంస్థకు రాబడి పెంచాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ విధులతో పాటు కార్గో, డోర్ డెలివరీ పార్సిల్స్‌ను బాధ్యతగా తీసుకొని సంస్థకు రాబడి పెంచాలని కోరారు. ఎస్‌టియు, ఎంఎఫ్, సూపర్‌వైజర్, కార్గో ఇన్‌ఛార్జీ పార్వతేషా, సిబ్బంది పాల్గొన్నారు.

దస్తగిరయ్య స్వామికి ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం



మండలంలోని వగరూరు గ్రామంలో వెలసిన దస్తగిరయ్య స్వామికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పూజలు నిర్వహించారు. శుక్రవారం దస్తగిరయ్య ఉరుసు సందర్భంగా ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఆటల పోటీలను పరిశీలించి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు వీరారెడ్డి, సర్పంచి లింగారెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలో శ్రీలక్ష్మీ రంగ కల్యాణ మండపంలో శుక్రవారం పురుషోత్తం రెడ్డి కుమారుడు మహేశ్వర రెడ్డి వివాహ వేడుకలకు వైసిపి ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ, ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి, దేవనకొండ జడ్‌పిటిసి కిట్టు, చిప్పగిరి ఎంపిపి హేమలత భర్త మారయ్య నూతన వధూవరులను ఆశీర్వదించారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న విరుపాక్షి


పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

- ఘనంగా 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రంలో పేద కుటుంబాల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని మంత్రి పరిశీలించి, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన పేద రోగులతో ఆత్మీయంగా మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచనా విధానం నుంచి పుట్టిన అద్భుత పథకమని తెలిపారు. సర్పంచి హరికృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేదికపై మంత్రి మాట్లాడారు. చంద్రబాబు హయాంలో పేదల ఆరోగ్యాన్ని పట్టించుకునే వారు కాదన్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలను జగనన్న ప్రభుత్వం పెంచిందని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య కిట్లను పంపిణీ చేశారు. వైసిపి తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, దేవనకొండ జడ్‌పిటిసి కిట్టు, ఎంపిటిసి మౌనిక, మండల సచివాలయాల కన్వీనర్ బసవరాజు, సొసైటీ సిఇఒ అశోక్, డాక్టర్ మారుతి కుమార్, కల్పన, శాంతి, ప్రియాంక, ఐసిడిఎస్ సిడిపిఒ నిర్మలాదేవి, సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని వెలమకూరు గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ప్రజలకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, హరిత, సాయి వెంకటేశ్వర్లు, రసూల్, వైసిపి నాయకులు రామచంద్ర మాట్లాడారు. టిబి సూపర్‌వైజర్ ఈరన్న, సిహెచ్.అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్లు రాజేంద్ర సాంబ, ఫార్మాసిస్టు రమేష్, వైసిపి నాయకులు రంగస్వామి, సోమన్న, లోకేష్, అంజి పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి హెచ్.రాము, వైసిపి నాయకులు మెడికల్ నాగరాజు, హనుమంతప్ప, మల్లిరెడ్డి, నాగరాజ్ మాట్లాడారు. వైద్యులు నిస్సి గ్రేస్, డాక్టర్ శేఖర్, డాక్టర్ గీత, డాక్టర్ శేష్మాబి పాల్గొని 754 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజ్, షేక్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ చిలకమ్మ, ఎఎన్‌ఎంలు పుష్పలత, లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఆస్పరిలో కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు


ఆదోనిలో మాట్లాడుతున్న సర్పంచి రాము

వలసల నివారణలో పాలకులు విఫలం : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

వర్షాల్లేక కరువు ఏర్పడి వ్యవసాయ కూలీలు వలస వెళ్తున్నారని, వలసలను నివారించడంలో పాలకులు విఫలం చెందారని సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు విమర్శించారు. శుక్రవారం మండలంలోని దొడ్డనకేరి గ్రామ సచివాలయం ముందు వ్యకాస నియోజకవర్గ అధ్యక్షులు గంగన్న ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దొడ్డనకేరి గ్రామ కార్యదర్శి ఉరుకుంద, ముని, జిల్లా సమితి సభ్యులు షేక్షావలీ పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామానికి చెందిన సిద్ధనగౌడు కుమారుడు వీరేష్ గౌడ్(33) గుండె పోటుతో మృతి చెందారు. శుక్రవారం అకస్మాత్తుగా రొమ్ము భాగంలో నొప్పి రావడంతో ఎమ్మిగనూరుకు తరలించి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరేష్ గౌడ్ మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

దీపావళి కానుకగా 50 శాతం ఐఆర్ ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

దీపావళి కానుకగా 50 శాతం మధ్యంతర ఐఆర్ ప్రకటించాలని ఎస్‌టియు నాయకులు నాగరాజు, లోక్య నాయక్, వీరచంద్ర యాదవ్, రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం పట్టణంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... 12వ పిఆర్‌సి కమిటీ వేసి దాదాపు 4 నెలలైనా సమావేశాలు లేవని, కమిటీ రిపోర్ట్ ఆలస్యమవుతుండటంతో వెంటనే దీపావళి కానుకగా 50 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు నాయకులు ప్రసాద్, గురురాజా, వీరేష్, నాగేంద్ర గౌడ్, రాముడు, శ్రీరాములు, గంగ నాయక్, జయరాం పాల్గొన్నారు.

వెల్దుర్తి సిఐగా సురేష్ కుమార్ రెడ్డి

వెల్దుర్తి : వెల్దుర్తి సిఐగా సురేష్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని గ్రామాల శాంతిభద్రతలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.


హిందు, ముస్లింలు సోదరభావంతో మెలగాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

- రూ.10 లక్షలతో ఈద్గా నిర్మాణం


ప్రజాశక్తి - ఆస్పరి

హిందువులు, ముస్లింలు సోదర భావంతో మెలగాలని, ఈద్గా ప్రార్థన మందిరం ప్రారంభోత్సవం చేయడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అట్టెకల్లు గ్రామ సమీపంలో రూ.10 లక్షలతో నిర్మించిన ముస్లింల ఈద్గాను మంత్రి గుమ్మనూరు జయరాం చేతులమీదుగా ప్రారంభించారు. వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, ముస్లిం పెద్దలు ఈద్గా ప్రార్థన మందిరం లేదని, ఈద్గాకు స్థలం కేటాయించి, ప్రార్థన మందిరాన్ని నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి గుమ్మనూరు జయరాం స్పందించి ఈద్గా నిర్మాణం చేపట్టారని తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయడంతో మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి జయరామ్, సోదరుడు నారాయణ స్వామి ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ రాణెమ్మ, సొసైటీ సిఇఒ అశోక్, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, జెసిఎస్ కన్వీనర్ బసవరాజు, నాయకులు హనుమంతు రెడ్డి, నాగరాజు, తిమ్మప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.


ఈద్గా ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి

దేవరగట్టులో మృతి చెందిన కుటుంబాలకు చెక్కులు పంపిణీ

దసర ఉత్సవాల్లో భాగంగా దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవాన్ని చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టు విరిగి ఆస్పరి గ్రామానికి చెందిన గణేష్, మొలగవల్లి గ్రామానికి చెందిన రామాంజినేయులు మృతి చెందిన విషయం తెలిసిందే. మంత్రి గుమ్మనూరు జయరామ్ చొరవ తీసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ సృజన మతి చెందిన కుటుంబాలకు రూ.లక్ష చెక్కును పంపిణీ చేయాలని చెప్పడంతో మంత్రి చేతుల మీదుగా చెక్కును అందజేశారు. మృతుని తల్లిదండ్రులు ఉసేని, సుజాత, చిన్న గాదిలింగన్న, వీరేష్, గాదిలింగ, దస్తగిరి పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచి విరుపాక్షి రెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా వైఎస్ఆర్ బీమా : సర్పంచి విరుపాక్షిరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

మరణించి వారి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా అండగా ఉంటుందని ముగతి సర్పంచి ముగతి విరుపాక్షిరెడ్డి తెలిపారు. శుక్రవారం ముగతి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన బోయ ఉరుకుంద (49) కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉరుకుంద అనారోగ్యంతో మృతి చెందారన్నారు. వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సహాయాన్ని శుక్రవారం సచివాలయం-1లో నామిని మృతుని భార్య నాగేంద్రమ్మకు రూ.10 వేల నగదును అందజేశారు. మృతి చెందిన ఉరుకుంద కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.లక్ష అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.90 వేలు నామిని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ దస్తగిరి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని వరిముక్కల గ్రామ మట్టి రహదారి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణ పనులను వైసిపి మండల నాయకులు అలారుదిన్నె ప్రభాకర్ రెడ్డి, సర్పంచి మల్లయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఎంఇఒ ఆగ్రహం

ప్రజాశక్తి - కోసిగి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఇఒ

మండల పరిషత్ ప్రాథమిక (రంగప్ప గట్టు) పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఎంఇఒ నాగేషప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాల ఆకస్మిక తనిఖీలో భాగంగా కోసిగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో (రంగప్ప గట్టు) విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు కోడిగుడ్లపై ఉన్న పొట్టును తొలగించి ఇవ్వాలని తెలిపారు. కొత్త మెనూ అమలు చేయాలని తెలియజేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా పాఠశాల సమయంలో ఎంఇఒ కార్యాలయానికి వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఆర్‌పి యోహన్ పాల్గొన్నారు.

రొయ్యలు, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మత్స్యశాఖ జిల్లా అధికారి సి.శ్యామలమ్మ, సహాయ మత్స్య పర్యవేక్షకులు డి.నాగరాజు, తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిఎల్‌పిఒ కార్యాలయ ఎఒ వీరభద్రప్ప, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ విజయ శేఖర్‌లు రొయ్యలు, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ మాట్లాడారు. నవంబర్ 3, 4, 5న కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్‌లో ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చేపలు, రొయ్యల వినియోగం పెంచడం, చేపలు, రొయ్యలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా దస్తగిరి స్వామి ఉరుసు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కుంకనూరు గ్రామంలో శుక్రవారం దస్తగిరి స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వైసిపి మహిళ విభాగం జిల్లా అధ్యక్షులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు దర్గాను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెర్నేకల్ మాజీ సర్పంచి రాజన్న, వైసిపి నాయకులు సత్యరాజ్, చిన్న వెంకప్ప, చందమామ రాముడు, రాజు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

పటిష్టమైన ఓటరు జాబితాకు కృషి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదోని నియోజకవర్గ పరిధిలో పటిష్టమైన ఓటరు జాబితాను తయారు చేస్తున్నామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బూత్ లెవెల్ అధికారులతో ఇంటింటి ఓటర్ల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. అప్పుడు గుర్తించిన మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన జాబితా తయారు చేసి త్వరలో సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ప్రచురించిన జాబితాకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను డిసెంబర్ 1, 2023 వరకు స్వీకరిస్తామన్నారు. అందుకు సంబంధించిన పరిష్కారం డిసెంబర్ 26 నాటికి పూర్తి చేసి జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఎమైనా ఇంటి నెంబర్లు, ఓటర్ల వయస్సు, పుట్టినతేదీలు, ఒకే ఇంట్లో ఎక్కువ మొత్తంలో ఓటర్లు ఉండడం లాంటి పొరపాట్లను గమనిస్తే వాటిని సంబంధిత బిఎల్ఒ, ఏఈఆర్ఒ, ఈఆర్ఒ, ఎన్నికల అధికారి దృష్టికి తీసుకు రావాలని కోరారు. https://ceoandhra.nic.in, https://voters.eci.gov.in వెబ్‌సైట్, Voters Helpline మొబైల్ యాప్ ద్వారా పోలింగ్ కేంద్రాల వారీగా ప్రజలు, ఓటర్లు పేరును ఓటరు జాబితాలో నమోదయినదో లేదో చూసుకోవచ్చని తెలిపారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, డిఎల్‌పిఒ కార్యాలయపు ఎఒ వీరభద్రప్ప, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ విజయ్ శేఖర్, వైసిపి నుంచి ప్రసాద్, కాంగ్రెస్ నుంచి దేవిశెట్టి ప్రకాష్, టిడిపి నుంచి భూపాల్ చౌదరి, బిజెపి నుంచి నాగరాజుగౌడ్, సిపిఐ నుంచి సుదర్శన్, సిపిఎం నుంచి లక్ష్మణ్, జనసేన నుండి తాహెర్ వలీ, టిఆర్ఎస్ నుంచి ఫయాజ్ బాష పాల్గొన్నారు.

దూదేకులకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

- 'చలో గుంటూరు' దూదేకుల ముస్లిం సింహగర్జన గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మందికి పైగా దూదేకుల కులస్తులు ఉన్నప్పటికీ చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించకపోవడం దారుణమని నాయకులు పేర్కొన్నారు. నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 'చలో గుంటూరు' నూర్ బాషా, దూదేకుల ముస్లిం సింహగర్జన గోడపత్రికను శుక్రవారం పట్టణంలోని స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గౌరవాధ్యక్షులు చాంద్ పీర, కన్వీనర్ లుక్మాన్, సంఘం నాయకులు రాజాచాంద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుంటూరులో జరిగే దూదేకుల ముస్లిం సింహగర్జన కార్యక్రమానికి నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల నుంచి పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి శనివారం సాయంత్రం వాహనాలు బయల్దేరుతున్నట్లు తెలిపారు. ఆర్‌విపిఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా, పెద్దకడబూరు మండల అధ్యక్షులు పక్కీరప్ప, దస్తగిరి, బాబు, సుభాన్, నబి, సలీం పాల్గొన్నారు.



నత్త నడకన నిర్మాణాలు

- ముందుకు సాగని సచివాలయాలు, ఆర్‌బికెల పనులు
- కొన్ని పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం..
- ఇరుకు గదుల్లోనే సచివాలయ ఉద్యోగులు విధులు

ప్రజాశక్తి - పాములపాడు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలకు వెళ్లకుండా 72 రకాల సేవలను సచివాలయం ద్వారా అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లోనే సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. కానీ పాములపాడు



బానకచెర్ల గ్రామంలో నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

మండలంలో అధికారుల నిర్లక్ష్యమా.. లేక కాంట్రాక్టర్ల అలసత్వమో కానీ రెండు మూడు గ్రామాల్లో తప్ప ఇంతవరకు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణంలోనే కొనసాగుతున్న పరిస్థితి ఉంది.

పాములపాడు మండలంలో 13 గ్రామ సచివాలయాలు, 13 రైతు భరోసా కేంద్రాలు, ఐదు హెల్త్ క్లినిక్‌లను నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయి. సచివాలయాల డిజైన్ పట్టి కొన్ని గ్రామాలలో రూ. 30 లక్షలు, రూ. 40 లక్షలు చొప్పున కేటాయించారు. రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు రూ. 21.8 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ. 17.5 లక్షల నిధులు చొప్పున మంజూరయ్యాయి. మండలంలో ఐదు హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా మొట్టమొదటిగా బానకచర్ల గ్రామంలో నిర్మాణం పూర్తి చేయడంతో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, సర్పంచి ఆవుల జయసుధ ప్రారంభించారు. ఎర్రగుడూరు, చెలిమిల్ల, మద్దూరు, జూటూరు గ్రామాలలో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి కాలేదు. అలాగే సచివాలయాలు తుమ్మలూరు, ఎర్ర గూడూరు, మద్దూరు గ్రామాలలో మాత్రమే పూర్తి కావడంతో ఎమ్మెల్యే ఆర్థర్, జెడ్పిటిసి జ్యోతి రామలింగేశ్వర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ మూడు గ్రామాల మినహా మిగతా 10 గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. భానుముక్కల గ్రామంలో ఇరుకు గదుల్లో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. భానుముక్కల, బానకచెర్ల గ్రామాలలో సచివాలయాలు పూర్తి అయినప్పటికీ ఇంకా చిన్న చిన్న పనులు పెండింగ్ ఉండడంతో ప్రారంభానికి నోచుకోకుండా అలాగే నిలబడిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నిర్మాణాలు మాత్రం నత్త నడకన నడుస్తున్నాయి. మరో పక్క ప్రజల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. నాలుగు సంవత్సరాలు గడుస్తున్న నిర్మాణాలు ఎందుకు పూర్తి కావడం లేదోనని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదా కాంట్రాక్టర్లకు బిల్లులు పడడం లేదా అనే చర్చ కొనసాగుతుంది. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న పరిస్థితి ఉందని అధికార పార్టీ నాయకుల్లో కూడా చర్చ కొనసాగుతుండడం గమనార్హం. ఏదేమనప్పటికీ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేసిన వాటికి వెంటనే బిల్లులు పెడుతున్నాం

గత సంవత్సరం క్రితం బిల్లులు పడకపోవడం వాస్తవమే. కానీ ఈ సంవత్సరం అలాంటిది ఏమీ లేదు. పని పూర్తి చేసిన వాటికి తక్షణమే బిల్లులు పెడుతున్నాం. నిర్మాణాలు వివిధ దశల్లో అవుతున్నాయి. త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

- పంచాయతీరాజ్ ఎఇ రాఘవేంద్ర ప్రసాద్.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తపల్లి



రైతు అబ్దుల్ రజాక్ (ఫైల్)

అప్పుల బాధతో పొలం వద్ద పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తపల్లి మండలం నందికుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. నందికుంట గ్రామానికి చెందిన పింజరి అబ్దుల్ రజాక్ (38) తన 3 ఎకరాల సొంత పొలంతో పాటు 5 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, మినుము పంటలు సాగు చేశాడు. పంటల సాగు కోసం రూ. 6 లక్షల వరకు అప్పు చేశాడు. రెండు సంవత్సరాల నుంచి వేసిన పంటలు సరిగ్గా రాకపోవడం, సాగు కోసం తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతు తెల్లారిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూశారు. అక్కడ విగత జీవిగా పడి ఉన్న అబ్దుల్ రజాక్‌ను చూసి కుటుంబ సభ్యులు భోరున విలపించారు. రైతుకు భార్య మౌలాబి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రైతు భార్య మౌలాబి పిర్యాదు మేరకు ఎస్సై హుస్సేన్ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నందికుంట గ్రామంలో ఈ రెండేళ్ల కాల వ్యవధిలో అప్పుల బాధ తట్టుకోలేక దాదాపు నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : రైతు సంఘం

నందికుంట గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు సంజీవరాయుడు డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకొనే ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయాన్నారు. నందికుంట గ్రామంలోనే సుమారు నలుగురు రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతు కుటుంబానికి 10 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు, పక్కన ఎస్‌పి, అడిషనల్ ఎస్‌పి

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- పోలీస్ సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఆయుధాల ప్రదర్శన
- ప్రారంభించిన జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఈ నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఓపెన్ హౌస్ కార్యక్రమానికి విచ్చేసిన పాఠశాల విద్యార్థులతో ఎస్పీ మాట్లాడారు. ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఆయుధాలు, పోలీసు పరికరాలు, వాటి పనితీరు వివరిస్తూ విద్యార్థులకు ఎస్పీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిని ఆయుధాలుగా పరిగణించకూడదని, పోలీస్ వారు ఆత్మ రక్షణకు వాడే పరికరాలుగా మాత్రమే చూడాలన్నారు. సహజంగా పోలీస్ వారు అతి క్లిష్టమైన పరిస్థితులలో తప్ప ఈ ఆయుధాలను వాడరని చెప్పారు. సమాజం కోసం, వారి రక్షణ కోరి విధి నిర్వహణలో ఎందరో పోలీసులు అహర్నిశలు శ్రమించి మృతి చెందారని, వారి త్యాగం ఎన్నటికీ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో బుల్లెట్ ప్రూఫ్ వెహికల్, కమ్యూనికేషన్ వాహనం, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, బాంబు డిస్పోజల్ పరికరాలు, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందాలు, సెల్ జామర్ల గురించి విద్యార్థులకు, వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి.వెంకట రాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డిఎస్‌పి రంగముని, ఆర్ఐలు సుధాకర్, మంజునాథ్, ఆర్ఎస్ఐలు అల్లా ఉద్దీన్, దాదాపీర, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన విజ్ఞప్తులపై తక్షణమే స్పందించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం దొర్నిపాడు మండల కేంద్రంలోని సచివాలయ ఆవరణలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి విజ్ఞప్తులను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, ఇతర జిల్లాధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ శాసనసభ్యులు బ్రిజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వచ్చిన 33 పేషంట్లను రిఫెరల్ హాస్పటల్లోకి తరలించి ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని డిఇఒకు సూచించారు. రీ ఓపెన్ అయిన కేసులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. ప్రతిరోజు సచివాలయాల్లో 3 నుండి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలు సూచించిన మూడు రిజిస్టర్లను తప్పక నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికులు తమకు ఎనిమిది నెలల నుండి జీతాలు రావడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బారెడ్డి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అర్జీ అందజేస్తున్న ప్రజలు

డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ సస్పెండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా భూములను నమోదు చేసిన డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించి సర్వే 929లో 10.04 ఎకరాల విస్తీర్ణం దేవదాయ భూములను రెవెన్యూ రికార్డులో తారుమారు చేసిన డిప్యూటీ తహశీల్దార్ వై శ్రీనివాసులు సస్పెండ్ చేశామన్నారు. అలాగే 80 బన్నూరు విఆర్ఒ వెంకటరమణను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు వీరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు అంబటి గురివి రెడ్డి

దోబీ ఘాట్ నిర్మాణానికి రూ. 10 లక్షలు

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండల పరిధిలోని చింతలాయపల్లిలో దోబీ ఘాట్ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరైనట్లు వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి శుక్రవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రజకవృత్తిదారుల కోసం దోబీ ఘాట్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కృషితో నిధులు మంజూరు అయ్యాయని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

- కలెక్టర్‌ను కోరిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కెసి కెనాల్ రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ శుక్రవారం దొర్నిపాడులో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్‌కు విన్నవించారు. కెసికి నీటి విడుదల చేయాలని కోరారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరు, సంబంధిత అధికారులు మాత్రమే కూర్చోవలసిన స్పందన కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంవత్సరం క్రితం ఆళ్లగడ్డకు వచ్చి రూ. 100 కోట్లు ఇస్తామని చెప్పారని, ఇంతవరకు కోటి రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

29న ధర్నాను విజయవంతం చేయండి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - అవుకు


సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 29న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగమయ్య కోరారు. శుక్రవారం మండలంలోని గుళ్ళ సింగవరం ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐజయ్య, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బరాయుడు, గోవింద నాయక్, షఫీ, రవికాంత్ బాబు, చంద్రశేఖర్ శర్మ, వీరప్ప, బలరాముడు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

31న ప్రజా రక్షణ భేరి బస్సు జాతా

- జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఈ నెల 31న నందికొట్కూరుకు చేరుకునే సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు జాతాను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం జూపాడుబంగ్లా మండలం క్వాటర్స్‌లో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నాయకులు ఎం.కర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు జాతా ఆదోని పట్టణం నుంచి బయలుదేరి 31వ తేదీ నందికొట్కూరు పట్టణం చేరుకుంటుందని చెప్పారు. 31న మంగళవారం ఉదయం 10 గంటలకు నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు జాతా జయప్రదం కోరుతూ ఈ నెల 28, 29 తేదీలలో నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, బంగ్లా మండలాలలో జీపు జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు అవుతున్నా, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 5 సంవత్సరాలు అవుతున్నా రాష్ట్రానికి, దేశానికి ఏ ఒక్క మంచి పని చేయలేదన్నారు. ప్రజలపై మరిన్ని భారాలు మోపుతున్నాయని, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి ప్రభుత్వానికి వైఎస్ఆర్, టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు నెరవేర్చకుండా యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మొత్తం ప్రభుత్వ రంగాలన్నీ ప్రైవేటీకరణ చేస్తూ ఆదానీ, అంబానికి దోచి పెడుతుందని విమర్శించారు. అసమానతలు లేకుండా రాష్ట్ర అభివృద్ధికి సిపిఎం నిర్వహించే పోరాటంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ఏసన్న, శివ ప్రసాద్, బన్నూరు దేవరాజ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఎం.నాగేశ్వరరావు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : సిఐటియు

ప్రజాశక్తి - డోన్

మీటర్ రీడర్ల సమస్యల పరిష్కారం కోసం అనంతపురం నుండి వారు తలపెట్టిన బైకు జాతాను అనుమతులు లేవనే కారణంతో పోలీసులు అడ్డుకొని నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మీటర్ రీడర్ల యూనియన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు రాజు అన్నారు. శుక్రవారం స్థానిక కొండపేటలోని సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడుతూ అనుమతుల కోసం పది రోజుల క్రితమే కోరినా ఎటూ తేల్చకుండా తీరా బయలుదేరే సమయంలో అడ్డుకోవడం దారుణమన్నారు. వాస్తవానికి ఈ రోజు శ్రీకాకుళం, కడప, అనంతపురం ప్రాంతాల నుండి బైక్ జాతాలు బయలుదేరి ఈ నెల 31న విజయవాడలోని ధర్నా చౌక్‌కు చేరాల్సి ఉందన్నారు. అయితే అనంతపురం నుండి బయలుదేరాల్సిన జాతాను మాత్రమే అడ్డుకోవడంలో ఉన్న ఔచిత్యం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. ఇప్పటికైనా మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలవారీ వేతనాలు అమలు చేయాలని, యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని, కుదించిన పని దినాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.కొండయ్య, మీటర్ లీడర్ల యూనియన్ జిల్లా నాయకులు రామకృష్ణుడు, రామనాయుడు, మోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పట్టుదలతో కృషి చేస్తే మెజార్టీ ఖాయం : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తలపెట్టిన పార్టీ కార్యక్రమాల్లో భాగంగా మినీ మేనిఫెస్టోపై క్రమశిక్షణతో, అంకితభావంతో క్లస్టర్ కో ఆర్డినేటర్‌లు, మండల కన్వీనర్స్, బూత్ ఇన్చార్జిలు ప్రజల్లోకి విస్తత అవగాహన కల్పిస్తే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియోజవర్గంలో టిడిపి అభ్యర్థి 50వేల ఓట్ల మెజార్టీ సాధించడం ఖాయమని నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూర్ ఇంచార్జ్ గౌరు వెంకట్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలోని మాండ్ర స్వగృహంలో మండల క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ పరిశీలకుడు దేవళ్ల మురళి మాట్లాడుతూ కుట్రపూరిత జగన్మోహన్ రెడ్డి పార్టీ వచ్చే ఎన్నికల్లో ప్రజల చేత తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీ సాధించే దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ క్లస్టర్ ఇన్చార్జులు లాయర్ జాకీర్, ముర్తుజావలి, ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ షకీల్ అహమ్మద్, ఎస్సి సేల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జయసూర్య, పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, నాయకులు షేక్ జమిల్, రసూల్ ఖాన్, మండలాల కన్వీనర్స్ ఖాతా రమేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, పలుచాని మహేశ్వర్ రెడ్డి, జడ్ వెంకటరెడ్డి, బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేతలు



ప్రిన్సిపల్ ఆర్.సునీతను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆర్‌యు పాలకమండలి సభ్యులుగా ఆర్.సునీత

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రాయలసీమ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులుగా నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతరులు ప్రిన్సిపల్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ నిరంతర కార్యదక్షత ఎంతో ప్రశంసనీయ మైనదని, వీరి ప్రతిభను గుర్తించి రాయలసీమ విశ్వవిద్యాలయం వారు ఈసీ మెంబర్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో శ్రమించే తత్వం ఉంటే అది ఏదో ఒక రోజు గుర్తింపబడే అవకాశం వస్తుందన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనకి ఈ అవకాశం కల్పించిన ఉన్నత విద్యా శాఖ అధికారులకు, రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

- మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో గల జెండేవాలే సాహెబ్ దర్గాలో 286వ దస్తగిరి స్వామి గంధం మహోత్సవం పీఠాధిపతి ఆబ్దాల్ హుస్సేన్ సాహెబ్ ఖాద్రీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండలం కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పూల చాదార్ సమర్పించి ఫాతేహాలు సమర్పించారు. గంధం, ఉర్సు మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సిఐ రమేష్ బాబుకు సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్న డిఎస్‌పి

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డిఎస్పి వెంకటరామయ్య అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ సూచనల మేరకు పట్టణ సీఐ రమేష్ బాబు పర్యవేక్షణలో శుక్రవారం మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 140 మంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సంస్థ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆళ్లగడ్డ వైద్యులు శబరీస్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి రెడ్ క్రాస్ సొసైటీ వారు ఇచ్చిన సర్టిఫికెట్లను డీఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో సిఐలు హనుమంతు నాయక్, వంశీధర్ , మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ బాబు, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల 25 మంది రక్తదానం చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ రక్తదానం చేసిన 25 మంది యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. పోలీస్ సిబ్బంది, కానిస్టేబుల్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమాజ్ వాదీ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా పాండురంగ యాదవ్

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పసుపల గ్రామానికి చెందిన సిద్ధపు పాండురంగ యాదవ్ సమాజ్ వాది పార్టీ పశ్చిమ రాయలసీమ (కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి) జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక విలేకరులతో పాండురంగ యాదవ్ మాట్లాడారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను మోపిన సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్‌కు, రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లుకు, సోషలిస్ట్ థింకర్స్ ఫోరం అధ్యక్షులు, సమాజ్ వాది పార్టీ విస్తరణకు తపించే బొట్ల మధు యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన తనకు పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నాలుగు జిల్లాల పరిధిలో బహుజన భావజాల సారూప్యత గల పోరాట యోధులందరిని పార్టీలోకి ఆహ్వానిస్తానని పేర్కొన్నారు. దశాబ్దాలుగా బీసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తున్న నాయకులంతా రాజకీయాల్లోకి వచ్చి రాజ్యాధికారాన్ని దక్కించుకుంటేనే ఆయా వర్గాలకు న్యాయం చేయగలమని తెలిపారు. ప్రస్తుతం ఏపిలో ఉన్నది ఒకే పార్టీ అని, బాబు, జగన్, పవన్ పార్టీలు బిజెపికి కొమ్ము కాస్తూ బహుజన అభివృద్ధిని, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలును పెడచెవిన పెట్టాయని విమర్శించారు. సమగ్ర కులగణన జరిగితే ఎవరి బలం ఏంటో తెలిసిపోతుందని, తద్వారా బహుజనులు ఐక్యమై రాజ్యాధికారానికి ముందుకొస్తారని తెలిసి బిజెపి అడ్డుపడుతుందని అన్నారు. పార్టీ వ్యవస్థాపకులు నేతాజీ ములాయం సింగ్ యాదవ్ ఆశయ సాధనకు బహుజన యువత అంతా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు.



పాండురంగ యాదవ్

అందుబాటులో పంట నమోదు జాబితా

- అభ్యంతరాలు ఉంటే తెలపండి : ఎఒ

ప్రజాశకి - నంద్యాల రూరల్

ఈ పంట నమోదు చేసుకున్న రైతుల పంట వివరాల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఏవో ప్రసాద రావు రైతులకు సూచించారు. శుక్రవారం నంద్యాల మండలం కానాల, ఉడుమాలపురం గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభలలో ఆయన పాల్గొన్నారు. రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచిన జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 26 నుండి 29 వరకు గ్రామ సభలు నిర్వహించి సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రంలో జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. మండలంలోని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణి మోహన్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పుష్పలత, సంధ్యారాణి, కానాల గ్రామ సర్పంచి, రైతులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని రైతులు ఈ క్రాప్ బుకింగ్‌లో ఏమైనా తప్పులుంటే ఈ నెల 29వ తేదీ లోపు పరిష్కరించుకోవాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కృష్ణ మల్లారెడ్డి తెలిపారు. బండి ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో స్వాతి మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ వలన రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, ధాన్యం కొనుగోలుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** ఖరీఫ్ పంట నమోదు కార్యక్రమంలో తప్పిదాలు ఉంటే సరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పణీశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో పంట నమోదు జాబితాను ఆర్బీకే కేంద్రాల వద్ద ప్రదర్శనకు ఉంచారు. రైతులకు ఎవరికైనా అభ్యంతరాలు, తప్పిదాలు ఉంటే ఈ నెల 29వ తేదీలోపు ఆర్బీకే కేంద్రాల్లో తెలియజేయాలన్నారు. తదుపరి తుది జాబితా నవంబర్ 1వ తేదీన ప్రకటిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్విని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి మౌలాలి, వ్యవసాయ సహాయకులు గోవర్ధన్ ఆచారి పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని మసీదుపురం గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ పంట నమోదు కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. గ్రామ వ్యవసాయ సహాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు తప్పనిసరి గా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రంగనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో సర్పంచ్ బంగారు షరీఫ్ ఆధ్వర్యంలో ఖరీఫ్ ఈ పంట నమోదు పై గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో విఏఏ, రైతులు పాల్గొన్నారు.



నంద్యాల రూరల్ : మాట్లాడుతున్న ఎఒ ప్రసాద రావు

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి : ఎస్ఇ

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగ ప్రధాన కాలువ ఆధారంగా పంటలు సాగు చేసిన రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని గంగ ఎస్ఇ వెంకటరమణయ్య సూచించారు. శుక్రవారం రుద్రవరం, సిరివెళ్ల, ఆళ్లగడ్డ మండలాల పరిధిలోని తెలుగు గంగ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటిని, బ్లాక్ ఛానల్‌లను ఆయన పరిశీలించారు. గంగ సిబ్బందికి సాగునీటి వాడకంపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు వారబందీ పద్ధతి ప్రకారం గంగ ప్రధాన కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు విషయం అందరికి తెలిసిందేనన్నారు. ప్రస్తుతం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 2000 క్యూసెక్కుల నీటిని గంగ ప్రధాన కాలువ విడుదల చేశారని, ఇందులో భాగంగా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు బ్లాక్ ఛానల్ ద్వారా వృధాగా పోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ గండ్లేరు రిజర్వాయర్‌కు 500 క్యూసెక్కుల నీరు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వారబందీ పద్ధతిలో రైతులకు గంగ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నామని, సాగునీరు వృధా కాకుండా రైతులు సహకరించాలని కోరారు. ఇప్పటి నుండి నవంబర్ 4వ తేదీ వరకు గంగ ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేస్తారని, తదుపరి నవంబర్ నెలలో రెండు విడతలుగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ శంకర్ రెడ్డి, డిఈలు చంద్రశేఖర్ రెడ్డి, శరత్ కుమార్, ఏఈలు రామశేషు, రాజా సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఇ



అభివాదం చేస్తున్న వామపక్ష విద్యార్థి, యువజన సంఘం నాయకులు

8న విద్యాసంస్థల బంద్

- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఆత్మకూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె దినేష్ కుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్ భాష, ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు జితేంద్ర మాట్లాడారు. 32 మంది విద్యార్థి యువజన ప్రాణ త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్నా కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నవంబర్ 8 నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు 1000 రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్షంగా ఆందోళనలో పాల్గొనడంతో పాటు ఆరోజు విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఐసా, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పాక్షిక చంద్రగ్రహణం - ఆలయాల మూసివేత

ప్రజాశక్తి - బనగానపల్లె : ఈ నెల 28న పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మండలంలోని ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆయా ఆలయ కార్యనిర్వాహకాధికారులు శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నేడు సాయంత్రం 4 గంటల నుండి 29వ తారీఖు ఉదయం 6 గంటల వరకు ఆలయం మూసివేస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 29వ తేదీ ఉదయం 6 గంటల నుండి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పిస్తామని తెలిపారు. అలాగే నందవరం చౌడేశ్వరిదేవి దేవస్థానం నేడు సాయంత్రం 4 నుండి 29వ తేదీ ఉదయం 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఈవో రామానుజన్ తెలిపారు. **మహానంది :** నేడు చంద్రగ్రహణం సందర్భంగా మహానందీశ్వర స్వామి దేవస్థానం సాయంత్రం 4 గంటల నుండి 29వ తారీకు ఉదయం 6 గంటల వరకు మూసి వేయనున్నట్లు ఆలయ అర్చకులు, వేద పండితులు తెలిపారు. తిరిగి 29వ తేదీ ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనం కల్పిస్తారు.

దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈ నెల 29న గుంటూరులో తమ హక్కులు సాధించుకునేందుకు చేపట్టిన దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయాలని ఎపి దూదేకుల నూర్బాష్ సంక్షేమ సంఘం నాయకులు బ్రహ్మయ్య, లాలయ్యలు కోరారు. చాగలమర్రి పట్టణంలోని దూదేకుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరయ్య, డీఎం షరీఫ్, నాగశేషు, ఇమాముల్, ఖాశీం, దస్తగిరి, సుద్దపల్లె దస్తగిరి తదితరులు. పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రుద్రవరం : గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ మధుసూదనరెడ్డి, హౌసింగ్ ఇన్చార్జ్ డిఈ నాగరాజు (ఆళ్లగడ్డ డిఈ) ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ ఆధ్వర్యంలో ఎంపిడిఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రవరం మండలంలో 915 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 329 పూర్తి అయ్యాయని చెప్పారు. నవంబర్ చివరి నాటికి మరో 343 పూర్తి చేయాల్సిందిగా ఉన్నతాధికారులు టార్గెట్ ఇచ్చామన్నారు. ఐహెచ్ఎస్ఎల్ కూడా డిసెంబరులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాదు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు మండలంలోని ఆర్.కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సమీరా ఎంపికయింది. ఇటీవల తెనాలిలో జరిగిన జంప్ రోప్ పోటీలలో సమీరా ప్రథమ స్థానం పొంది పసిడి పతకం సాధించింది. డిసెంబర్లో థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని సమీరాను, పిడి నాగేంద్రను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అభినందించారు. పోటీలకు వెళ్లే విద్యార్థికి హెచ్ఎం సుధాకర్ రూ.10 వేలు, పిడి నాగేంద్ర రూ. 10 వేలు ఇస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులు కూడా సహకారం అందిస్తామని తెలిపారు.

ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - రుద్రవరం : మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర గోమార్ పురుగు మందుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుద్రవరం మండలం వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, విజిలెన్స్ సిఐ నాగరాజు యాదవ్, ఎస్సై హనుమంతయ్యా, విజిలెన్స్ అగ్రికల్చర్ అధికారి రూపస్ రోనాల్డ్‌ఖఒ దుకాణంలోని పురుగుల మందులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని రూ. 4 లక్షల విలువ చేసే పురుగు మందులను సీజ్ చేశారు. ఈ తనిఖీలలో విస్తరణ అధికారి రాజు, గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ ఫని రాజశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి నేత పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గడివేముల : మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన మాజీ మండల అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు వంగాల శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉండుట్ల గ్రామ సర్పంచ్ గంగాధర్ రెడ్డి, టిడిపి నాయకులు గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వంగాల శ్రీనివాస్ రెడ్డిని టిడిపి నాయకులు గజమాలతో సత్కరించి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదానం శిబిరం ప్రారంభించారు. దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేశం నారాయణరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, దేశం వెంకటేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమైక్యతా భావం కోసం 'నా మట్టి-నా భూమి' : చైర్మన్

ప్రజాశక్తి - బేతంచెర్ల : దేశ ప్రజల్లో సమైక్యత భావం పెంచడం కోసం నా మట్టి-నా భూమి అనే కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రమేష్ బాబు, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో నా మట్టి-నాభూమి కార్యక్రమాని నిర్వహించారు. ఈ నెల 30, 31వ తేదీలలో ఢిల్లీలో జరుగుతున్న కార్యక్రమానికి మండల కేంద్రం నుండి గోరుమానుకొండ సర్పంచి కోడె వెంకటేశ్వర్లును, మట్టి కంచం, టెంకాయ, కలశంను పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అమ్జాద్ భాష, రమణ, సుజాత, వెంకటేశ్వర్లు నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** అజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ ఆధ్వర్యంలో నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని మట్టిని సేకరించి టౌన్ ప్లానింగ్ అధికారి బాల మద్దయ్య ద్వారా ఢిల్లీకి పంపించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే



రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలో రైతులకు అన్ని విధాలా అండగా ఉండేది తామేనని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం మానుకోవాలని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. శుక్రవారం దొర్నిపాడు కెసి కెనాల్ పరివాక ప్రాంతాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి ఎద్దడి ఉందని, అయినా సరే నియోజకవర్గ రైతుల క్షేమం కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపిలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాల పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని పదో వార్డులో టిడ్కో గృహాలకు సంబంధించి 110 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను, బీగాలను గంగుల అవంతికా రెడ్డి, గంగుల సారికలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ గోపవరం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు గుడ్ డే పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక సాయిబాబా నగర్‌లోని గుడ్ డే పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నలుగురు తరుణ్, జయ కార్తిక్, జీవీ చైత్రిక రావ్, అక్షయ్‌లు రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ రసూల్ ఆజాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ రసూల్ ఆజాద్, వైసిపి నాయకులు దేవ నగర్ భాషలు అభినందించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ అండర్-17, 14 షటిల్, బాట్మింటన్‌లో డిస్ట్రిక్ట్ లెవెల్లో ప్రతిభ కనబరిచి స్టేట్ లెవెల్ కాంపిటీషన్‌లో వచ్చే నెల 9 నుంచి 14వ తారీఖు వరకు వైజాగ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. అనంతరం కోచ్ నాగార్జున రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఆరోగ్యమే గొప్ప సంపద : ఎఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సంపద ఎంత ఉన్నా ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్లేనని అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి.వెంకట్రాముడు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ 75వ వార్షికోత్సవం సందర్భంగా 5కె పరుగు పందెం కార్యక్రమం శుక్రవారం నంద్యాలలో నిర్వహించారు. ఈ పరుగు నంద్యాల గవర్నమెంట్ కళాశాల నుండి ప్రారంభమై పొగాకు కంపెనీ మీదుగా ఎల్‌కెఆర్ ఫంక్షన్ హాల్, అక్కడినుండి తిరిగి మళ్ళీ గవర్నమెంట్ కాలేజీ గ్రౌండ్ వద్దకు చేరుకున్నారు. ఈ పరుగు పందెంలో నంద్యాల జిల్లా పోలీసులు, మహిళా కార్యదర్శులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మొదటి స్థానానికి రూ.1,500, రెండవ స్థానానికి రూ.1,000, మూడవ స్థానానికి రూ.500 పోలీసు అధికారులు పారితోషకంగా అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ ఈ పరుగు పందెంలో పాల్గొన్న వారందరూ 5కె చివరి వరకు పరుగును ముగించడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ ప్రతి రోజూ శారీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎ డిఎస్‌పి రంగముని, నంద్యాల టౌన్ సిఐలు ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, రవీంద్ర, దస్తగిరి బాబు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ఆర్ఐలు సుధాకర్, మంజునాథ్, టౌన్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం : ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తాయని పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఒడ్డుగండ్ల, రసుల్లపేట గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, చందమామ బాబు, రాముడు, కొత్తూరు నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఏనుగుమర్రి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ప్యాపిలి : మండలంలోని ఏనుగుమర్రి పాఠశాల విద్యార్థులు అండర్-17 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కృష్ణా నాయక్‌లు మాట్లాడుతూ నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే అండర్-17 రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టుకు ఏనుగుమర్రి విద్యార్థులు గణేష్ కుమార్, మనీషా అప్సర్ భాను, హిందూ మాదవిలు ఎంపికయినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొజ్జన్న, మారతమ్మ, మద్దయ్య, నాగం ఆంజనేయులు, సాలయ్య, సోనీ రమాదేవి, లోకేశ్వరి, పిడి పాల్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మద్దూరమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని మద్దూరు గ్రామంలో వెలసిన గ్రామ దేవత మద్దూరమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల పిలుపు మేరకు ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గని మద్దూరమ్మ తల్లిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ భూమా కిషోర్ రెడ్డిలు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కైప వెంకటసుబ్బయ్య శర్మ, పుల్లయ్య స్వామి, రామతేజస్వామి. శ్రీనివాసులు స్వామి, మురళీ స్వాములు వేద మంత్రోచ్ఛారణతో వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు జి.కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మండల నాయకులు శ్రీనివాసులరెడ్డి, మహబుబ్ షరీఫ్, జమాల్ వెంకట్రాంరెడ్డి, కమిటీ సభ్యులు సుగుణాకర్ శెట్టి, రమణయ్య, నాగేశ్వరరావు, చిన్న దస్తగిరి, సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజల సహకారంతోనే గ్రామ అభివృద్ధి : సర్పంచి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : మండలంలోని జిసి పాలెం గ్రామాన్ని ప్రజల సహకారంతోనే అభివృద్ధి చేస్తామని సర్పంచి కంచర్ల శోభారాణి, ఉపసర్పంచి చిన్న లింగారెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని, ఇంటిలో చెత్తను రోడ్లపై వేయకుండా సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని కోరారు. ప్రతి శుక్రవారం వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేసి రక్షిత మంచినీరు అందిస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొలిమిగుండ్ల మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన మాదిగ నాగరాజు (33) జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య సుంకమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31న మంగళవారం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

29న అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రిలో ఈ నెల 29న రాష్ట్ర జలమండలి సలహాదారు, మాజీ శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్ళగడ్డ శాసనసభ్యులు గంగుల బీజేంద్రరెడ్డిలు రూ.34 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబులాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం చాగలమర్రిలోని మహబూబ్ వలి కాలనీలోని వైసిపి కార్యాలయంలో వారు మాట్లాడారు.కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్లను, మురికి కాలువలను, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ, పూర్తి అయిన స్కూల్ బిల్డింగ్‌లను ప్రారంభిస్తారన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచర్ల మండలంలో ఉపాధి కొత్త పనులను గుర్తింపు కార్యక్రమం వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా డ్వామా మానిటరింగ్ అధికారి భాస్కర్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించి అవి పెరగడానికి నీటి సౌకర్యం కల్పించి, రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ శేషన్న, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో పోషక విలువలు తగ్గకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఇఒ అబ్దుల్ కలాం అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయని పేట గ్రామంలోని మెయిన్ స్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాడు-నేడు రికార్డులను, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఆర్పి కమల, అకౌంటెంట్ కాంతారావు, హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఉచిత సామూహిక చండీ హోమం

ప్రజాశక్తి - శ్రీశైలం : ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం ఉచిత సామూహిక చండీ హోమం నిర్వహించారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు ఈ ఉచిత చండీ హోమం చంద్రావతి కళ్యాణ మండపంలో నిర్వహించారు. భక్తులందరికీ అతి శీఘ్ర దర్శనం, స్వామివారి స్పర్శ దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులే కాకుండా నంద్యాల, కర్నూలు, మార్కాపురం, తిరుపతి, తెనాలి, గుంటూరు, బాపట్ల, అనంతపురం, తిరుపతి, హైదరాబాద్ పలు ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు.

సెక్టోరల్ పోస్ట్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాలలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబైలిజషన్ ఆఫీసర్ (సిఎంఒ) సెక్టోరల్ 1 పోస్టునకు డిప్యూటేషన్ ఆన్ ఫారిన్ సర్వీస్ టర్మ్స్ నిబంధనలను అనుసరించి పని చేయుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖధికారి కె. సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ నెల 31వ తేదీ నాటికి 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన, పాఠశాల సబ్జెక్టులు కలిగిన గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేసేవారు, మండల విద్యాశాఖాధికారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27 నుండి 31వ తేదీ సాయంత్రం 5 గంటలోపు జిల్లా సమగ్ర శిక్ష నంద్యాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

యాగంటి దేవస్థానంలో వేలం పాటలు

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం తలనీలాలు, సగ భాగం కొబ్బరిచిప్పలు పోగు చేసుకొనుటకు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి చిప్పలను పోగు చేసుకునేందుకు పాతపాడు గ్రామానికి చెందిన కే.చిన్న సుబ్బరాయుడు రూ. 2 లక్షల 30 వేలకు అధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. తలనీలాల పోగుకు సరైన వేలంపాటలు రాకపోవడంతో నవంబర్ 4వ తేదీకి వాయిదా వేసినట్టు ఆలయ ఈవో తెలిపారు. ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

సబ్సిడీలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - మిడుతూరు : వ్యవసాయ ఉద్యాన పంటలకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, రైతులు ఉపయోగించుకోవాలని ఉద్యాన అధికారిణి కె.చందన తెలిపారు. శుక్రవారం మిడుతూరు కేంద్రంలోని పంట నమోదు వివరాలూ పరిశీలించారు. అనంతరం మిరప తోటలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులైన రైతులందరు తప్పక రాయితీలను వినియోగించుకోవాలని సూచించారు. ఉల్లి గోదాములు, ఉల్లి విత్తనాలు యంత్రాలు, మినీ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు మొదలగు వాటిపై సబ్సిడీలు ఉన్నాయని, వీటి కోసం ఉద్యాన అధికారిణిని, సంబంధిత రైతు భరోసా కేంద్రాలను రైతులు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పీరు నాయక్, ఎంపీఈవో కిషోర్, విఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి శివ కార్తీక్ రెడ్డి అదృశ్యమైనట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. శివలక్ష్మి కుమారుడు శివ కార్తీక్ రెడ్డి ఎల్లావత్తులలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి తల్లి ఫిర్యాదు చేసింది.

29న మంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామల : మండలంలోని మంగపల్లి గ్రామంలో ఈ నెల 29వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులో మాట్లాడుతూ గుండె జబ్బులు, బిపి, షుగర్, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీ వ్యాధులు, గర్భిణులు, ఎముకలు, కీళ్లు, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, దంత వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఉచిత భోజన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంజామల, కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల సామర్థ్యాలను మెరుగు పరచాలి : సిడిపిఒ

ప్రజాశక్తి - గడివేముల : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే పిల్లల పట్ల శ్రద్ధ వహించి పూర్తి సామర్థ్యాలను మెరుగుపరచాలని సిడిపిఓ చంద్రకళ కోరారు. శుక్రవారం గడివేముల మండల కేంద్రంలోని 6వ అంగన్వాడీ సెంటర్‌ను ఆమె ఏసిడిపిఓ పద్మావతితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు.

ప్రీ స్కూల్ విద్యా టైంటేబుల్‌ను అనుసరించి పిల్లల పట్ల విద్యాసామర్థ్యాలను పెంపొందించా లని, నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని, రోజు గుడ్డు అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ జయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ రాములమ్మ పాల్గొన్నారు.